క్లుప్తంగా

లయన్స్ క్లబ్ అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట: పట్టణంలోని లయన్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం అన్నదానం చేశారు. సంస్థ సభ్యుల జన్మదినం పురస్కరించుకుని ప్రతి నెల 15న కేజీఎఫ్ బస్టాండు వద్ద ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధీరజ్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సురేంద్రగౌడ్, మూర్తి, మంజునాథ్, శబరీష్, నాగరాజు, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గం



ఆర్య వైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గ సభ్యులు

చౌడేపల్లె: శ్రీ లలిత ఆర్య వైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఆర్య వైశ్య కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా అధ్యక్షురాలిగా నాగలక్ష్మి, కార్యదర్శిగా చంద్రకళమ్మ, కోశాధికారిగా నిర్మలాదేవి, ఉపాధ్యక్షురాలిగా భారతమ్మ, లక్ష్మీసరస్వతమ్మ, గీత, రాణి, పద్మలత, మరో 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వీధికుక్కల పట్టివేత



పలమనేరు: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణలో తిరుపతి అనిమల్ కేర్ ల్యాండ్ సహకారంతో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం నిర్వహించారు. వాటిని స్టెరిలైజేషన్ నిమిత్తం ప్రత్యేక వాహనంలో తిరుపతికి తరలించారు. వీటికి వ్యాక్సిన్ వేసి మళ్లీ వారంత తర్వాత ఇక్కడే వదిలిపెట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కాలుష్య నియంత్రణకు అందరి భాగస్వామ్యం



మాట్లాడుతున్న ప్రభాకర్

పుంగనూరు: పర్యావరణ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం సంస్థ సభ్యులతో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సంస్థ తరఫున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామని, కాలుష్య నివారణ కోసం పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటుతామన్నారు. ఈ కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తామన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు నారాయణరెడ్డి, నందీశ్వరయ్య, సరస్వతి, చెంగారెడ్డి, హరినాథరెడ్డి, గణేష్, వెంకటేష్, నాగరాజ, హరిప్రసాద్, వెంకటముని, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

మోక్షగుండంకు నివాళి



పూతలపట్టు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164 జయంతి సందర్భంగా ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేందర్ నాయుడు ఆదివారం మోక్షగుండం చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పూతలపట్టు ఏఈ నరసింహులు, సిబ్బంది ఎస్‌ఈని శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈ జయరాజ్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఈరోజు

రాజంపేట ఎంపీ పర్యటన

పుంగనూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సోమవారం పుంగనూరులో పర్యటిస్తారని సీమ జిల్లాల మైనారిటీ సెల్ కన్వీనర్ ఫక్రుద్దీన్ షరీఫ్ తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఖాదర్‌ఖాన్ ఇటీవల మరణించారని, ఆయన ఇంటికి ఎంపీ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని తెలిపారు. అనంతరం ప్రజా సమస్యలపై మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలియజేశారు.

లక్షలు ఖర్చు పెట్టి చదవలేం



మధ్యతరగతి కుటుంబానికి చెందిన మా తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చు పెట్టి మమ్మల్ని చదివించలేరు. జగనన్న ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రారంభించకపోవడం బాధాకరం. కళాశాల సీట్ల మంజూరు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీట్లు వద్దని తాను రాసిన లేఖను వాపస్ తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ సీట్లను రాష్ట్రానికి కేటాయించాలి. డాక్టర్ కావాలన్నదే నా లక్ష్యం. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించడం సరికాదు. ప్రభుత్వ చర్య వల్ల ఎందరో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి కలుగుతోంది. **-బి.పల్లవి, నీట్ విద్యార్థిని, రామనపల్లె, బైరెడ్డిపల్లె మండలం**



మేలు చేసిన వారిపై దుష్ప్రచారం



పేద పిల్లలకు వైద్యవిద్య అందాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. దీంతో 700 వరకూ ప్రభుత్వ కోటాలో నీట్‌లో క్వాలిఫై అయిన వారికి సీట్లు దక్కేవి. వీటిని ఇప్పటి కూటమి ప్రభుత్వం ప్రైవేటు వారికి ధారాదత్తం చేసింది. పులివెందుల మెడికల్ కాలేజీలో అన్ని సౌకర్యాలున్నాయి కాబట్టే ఎన్ఎంసీ అనుమతులిచ్చింది. ఇది కూడా తెలుసుకోకుండా మంత్రి సత్యకుమార్ యాదవ్ గత ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉంది. వైద్య విద్య అందరికీ అందాలని మేలు చేసిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఇలా నింద లేస్తే కూటమి చేస్తున్న దుష్ప్రచారం జనానికి తెలీదా..? **-చెంగారెడ్డి, కూర్మాయి, పలమనేరు మండలం**

కొండెక్కిన కాలనీ ఇళ్ల నిర్మాణం

- నియోజకవర్గంలో మంజూరైన ఇళ్లు 13 వేలు
- ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ్లు 9 వేలు
- మిగిలినవి వివిధ దశల్లో 4 వేల ఇళ్లు
- స్తంభించిన పక్కా ఇళ్ల నిర్మాణ పనులు
- కేటగిరి-3 ఇళ్ల నిర్మాణంపై విచారణ
- విచారణ ముగిశాకే బిల్లులిస్తామంటున్న ప్రభుత్వం



పలమనేరు మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డి లేఔట్‌లో అర్ధంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణ పనులు

పలమనేరు: సొంతిల్లు కట్టుకోవాలనే ప్రతి పేదవాని కలను సాకారం చేసే దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలమనేరు నియోజకవర్గంలో నియోజకవర్గంలో 13 వేల ఇళ్లను మంజూరు చేసింది. వీటిల్లో 9వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలినవి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ దశల్లో నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వీటి నిర్మాణాలకు రూ.177 కోట్లను గత ప్రభుత్వం వెచ్చించింది.ఈ ప్రభుత్వంలోనూ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులిస్తామని అధికారులు చెబుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. లబ్ధిదారులతో అధికారులు సమావేశాలను నిర్వహించినా ఫలితం కనిపించడం లేదు. దీంతో హౌసింగ్ అధికారులు నిర్మాణాలను ఎలా వేగవంతం చేయాలో అర్థంకావడం లేదు. మరోవైపు కేటగిరి-3 కింద మంజూరైన ఇళ్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. వాటి నాణ్యతను పరిశీలించాకే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇస్తామని హౌసింగ్ మంత్రి కొలుసు పార్థసారథి ప్రకటించడం విదితమే. ఫలితంగా 4వేల నిర్మాణాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంటోంది.

కాలనీల్లోనే ఎక్కువగా...

పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి కాలనీలో మొత్తం 3031 ఇళ్లు మంజూరైతే..వీటిల్లో 1721 మాత్రం పూర్తయ్యాయి. మిగిలిన 1310 వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో 14 ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఆర్‌బీఎల్‌లో 30, బీఎల్(బిలో లింటర్) 892, ఎల్ఎల్‌లో 48, ఆర్ఎల్(రూఫ్‌లెవల్) 195, ఆర్‌సీలో 123గా వివిధ దశల్లో పనులు ఆగాయి. ఇదే విధంగా నియోజకవర్గంలో 12 లేఔట్లు ఉన్నాయి. ఈ విషయమై స్థానిక హౌసింగ్ డీఈ రమేష్‌రెడ్డిని వివరణ కోరగా డివిజన్ పరిధిలో జూలై నుంచి పక్కాగృహాల నిర్మాణ పనులు వేగంగా సాగనిమాట నిజమేనన్నారు. లబ్ధిదారులు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఇంటి పనులు చేసిన వారికి బిల్లులిస్తామని లబ్ధిదారులతో అవగాహన సమావేశాలను సైతం నిర్వహించామన్నారు. ఇక కేటగిరి-3లో ఈ డివిజన్‌లో నిర్మాణాలు లేవని, కేవలం జిల్లాలో నగరిలో మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు.

బోయకొండ కిటకిట





ప్రత్యేక అలంకారంలో బోయకొండ గంగమ్మ, ఆలయంలో భక్తుల రద్దీ

- కిక్కిరిసిన క్యూలు
- ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారిని ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంగమ్మ తల్లీ!.. మా కోర్కెలు తీర్చి మమ్మల్ని ఆశీర్వదించమ్మా.! అంటూ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీతో క్యూలు కిక్కిరిసిపోయాయి. భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దాదాపు 25వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈఓ ఏకాంబరం తెలిపారు.

గంగమ్మ సేవలో జిల్లా ఎస్పీ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ ఈఓ ఏకాంబరం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం ఎస్పీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆశీర్వాద మండపంలో అమ్మవారి శేష వస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ భద్రతపై ఈఓతో కలిసి ఎస్పీ చర్చించారు. కార్యక్రమంలో సీఐ రామ్‌భూపాల్ పాల్గొన్నారు.



ఎస్పీ మణికంఠ చందోలు దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈఓ ఏకాంబరం

ఎన్నో రోజులైంది సామీ మిమ్మల్ని చూసి!



దాదేపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- ఎమ్మెల్యేతో దాదేపల్లె ముస్లిం మహిళలు

చౌడేపల్లె: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చౌడేపల్లె నుంచి దాదేపల్లె మీదుగా ఆదివారం పలమనేరుకు వెళ్తున్నట్టు తెలుసుకున్న ముస్లిం మైనారిటీ మహిళలు ఆయన్ను కలిసేందుకు దాదేపల్లెలో రోడ్డుపైకి వచ్చారు. మహిళలను చూసిన పెద్దిరెడ్డి కారు దిగి వారిని ఆప్యాయంగా పలకరించారు. పెద్దాయనా! మిమ్మల్ని చూసి ఎన్నో రోజులైంది సామీ..అని ఆనందంగా ఆయనతో ముచ్చటించారు. ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. మహిళలను పేరు పేరునా పలకరిస్తూ పెద్దిరెడ్డి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు.

ముస్లింలు ఐక్యతకు నిదర్శనం

పుంగనూరు: ముస్లింలు మైనారిటీలు ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తారని, ఎప్పటిలాగే ఈసారి కూడా మిలాద్ ఉన్ నబి పండుగను సంతోషంగా జరుపుకోవాలని పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వారు వేర్వేరు శుభాకాంక్షలు తెలిపారు. సమాజ శ్రేయస్సుకు ముస్లింల సహకారం ఎంతో అవసరమని తెలియజేశారు.

మిలాద్ ఉన్ నబి పండుగ ఏర్పాట్లు



రాతిమసీదులో మాట్లాడుతున్న ముస్లిం నేతలు ఇనాయతుల్లా షరీఫ్, అస్లాం మురాది

పుంగనూరు: పట్టణంలో మిలాద్ ఉన్ నబి పండుగ నిర్వహణకు సంబంధించి ఆదివారం ముస్లిం నాయకులు ఇనాయతుల్లా షరీఫ్, అస్లాం మురాది ఆధ్వర్యంలో రాతిమసీదువీధి, కుమ్మరవీధి మకాన్ వద్ద ఏర్పాట్లకు పూనుకున్నారు. వారు మాట్లాడుతూ, పండుగ సందర్భంగా రాతిమసీదులో సోమవారం రాత్రి బెంగళూరుకు చెందిన మతగురువులతో ప్రార్థనలు, ధార్మికోపన్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే బుధవారం మకాన్ వద్ద ప్రార్థనలు నిర్వహించనున్నట్టు చెప్పారు. రాత్రి, పగలు కూడా అన్నదానం చేస్తామని, ముస్లింలు ఈ ప్రార్థనలకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో న్యామద్ షరీఫ్, నజురుల్లా, న్యామతుల్లా, అంజాద్, బాబా, సద్దామ్, ఇర్ఫాన్, ఖాజా, భక్షు, ఇలియాజ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం శ్రీవారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, నైవేద్య ఘంటానాదం, పూజార్చన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కోనేటిరాయ స్వామిని ఆస్థాన మండపంలో ప్రత్యేక కళ్యాణవేదికపై కొలువు దీర్చి ఆగమోక్తంగా కల్యాణం చేశారు. ఉత్సవమూర్తులపై తలంబ్రాలు కురిపించి మహామంగళ హారతులు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ కల్యాణోత్సవం సాగింది. ముందుగా రూ. 300 టికెట్లు కొనుగోలు చేసి భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, ఆలయ అర్చకులు శ్రీహర్ష దీక్షితులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

తవణంపల్లె: తెల్లగుండ్లపల్లె దళితవాడకు చెందిన అఖిల(20) అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మానసిక వ్యాధితో బాధపడుతున్న ఈ నెల 4న ఆమె అదృశ్యమైనట్లు తండ్రి దాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గురువే సమాజానికి మార్గనిర్దేశం



మాట్లాడుతున్న అచలానంద మఠం రవిచంద్ర

పలమనేరు: గురువే సమాజానికి సరైన మార్గ నిర్దేశకమని కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన అచలానంద మఠం రవిచంద్ర పేర్కొన్నారు. పలమనేరు సమీపంలోని కీలపట్ల కోనేటి రాయుని సన్నిధిలో ఆదివారం శ్రీ సూర్యనారాయణ భాగవతుల 15 వార్షికారాధన నిర్వహించారు. తొలుత ప్రభాతసేవ, లఘు గీతా పారాయణం వేదాంత వైజ్ఞానిక సభ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశివరామ దీక్షిత అచల గురు సాంప్రదాయం మేరకు గురువులను స్మరణార్థం వారిని పూజించే కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల తర్వాత గురువుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అందుకే మనం గురుదేవో మహేశ్వరః అని దైవంతో సమానంగా కొలుస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గీతామోహన్‌రెడ్డి, డాక్టర్ కూన దయానందస్వామి, తిరుపతయ్యస్వామి, వెంకటేశయ్య,శ్రీధర్‌శర్మ, శ్రీనివాసమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బై..బై.. గణేశా..!

- కోలాహలం..నిమజ్జనం
- యువకుల కేరింతల నడుమ ఊరేగింపు



పలమనేరులో నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య

పలమనేరు: పలమనేరులో వినాయక చవితి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలు తొమ్మిదో రోజైన ఆదివారం నిమజ్జనానికి తరలాయి. పట్టణంలో మొత్తం 60 పైగా విగ్రహాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఇప్పటికే 40 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆదివారం స్థానిక శ్రీనగర్‌కాలనీ, మునినారాయణ వీధి, ఎస్టీ కాలనీ, రాధాబంగ్లా తదితర ప్రాంతాల్లో యువకుల కేరింతలు, నృత్యాల మధ్య నిమజ్జనం చేశారు. వివిధ ప్రాంతాల్లోని వినాయకుని విగ్రహాలను మెయిన్ రోడ్డు మీదుగా బాణసంచా మోత నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. కొన్నిచోట్ల అన్నదానం, ప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాగరాజ, బాలాజీ, సురేష్, దేవా, శీనా, రామకృష్ణ, అజయ్, ఆర్ముగం, మురళి, రాధా బంగ్లా యూత్, ఆయా ప్రాంతాల్లోని యుకకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రాయలపేటలో..

పెద్దపంజాణి: మండలంలో రాయలపేటలోని విద్యానగర్, కరమల వీధిలో ఆదివారం కోలాహలంగా వినాయకుని నిమజ్జనం చేశారు. 9 రోజులు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. చివరి రోజు విగ్రహాలను ట్రాక్టర్‌లో మేళతాళాలు, బాణసంచా మోత నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ సమీపంలోని చెన్నారెడ్డిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు.



చౌడేపల్లె: నిమజ్జనానికి గణపయ్యను తరలిస్తున్న వినాయక యువజన సేవా సంఘ సభ్యులు

గణపయ్య లడ్డును దక్కించుకున్న ముస్లిం యువకుడు

పలమనేరు: స్థానిక శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు ఆదివారం వినాయకుడి లడ్డుకు వేలం నిర్వహించారు. అదే ప్రాంతానికి చెందిన అస్లాం అత్యధికంగా రూ.20వేలకు పాట పాడి లడ్డును దక్కించుకున్నాడు. ఇక్కడ వినాయకుడి విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలను హిందూ, ముస్లింలు మతసామరస్యతను చాటుతూ నిర్వహించడం ఆనవాయితీ.



పలమనేరులో..

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం వద్ద నెలకొల్పిన వినాయకుని ప్రతిమను ఆదివారం నిమజ్జనం చేశారు.7 రోజులపాటు బొజ్జగణపయ్య ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుని ట్రాక్టర్‌లో ముత్యాల పల్లకిలో ముస్తాబు చేశారు. వాయిద్య వాయిద్యాల హోరు, యువకుల కేరింతల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే పట్టణంలోని రాములవారి గుడి, నడివీధి గంగమ్మ, కురప్పల్లె, బస్టాండు తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

సదుంలో..

సదుం: చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. అరవపాలెం, వాల్మీకి వీధి తదితర ప్రాంతాల్లోని వినాయకుని ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. అంతకుముందు సందడి..సందడిగా ఉట్లోత్సవం నిర్వహించారు. యువకులు నువ్వా, నేనా? అని ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే అన్నదానం చేశారు.



పలమనేరులో..



పెద్దపంజాణి: రాయలపేటలో..



సదుం: ఊరేగుతున్న గణనాథుడు

నాలుగున్నర దశాబ్దాల స్నేహగీతం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1979-80లో చదువుకున్న విద్యార్థులు నాలుగున్నర దశాబ్దాల తర్వాత మళ్లీ ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుని స్కూల్లో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. చాలా ఏళ్ల తరువాత కలుసుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. తమ భవితకు బాటలు వేసిన గురువులు రాజారెడ్డి, ఎర్రయ్య, విశ్వనాథ్ రెడ్డి, సుబ్బరామానాయుడు, రాధాకృష్ణ, జయరాం నాయుడును దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భవిష్యత్‌కు పునాది వేసిన పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇన్నేళ్ల తరువాత వారు కలుసుకోవడానికి కృషి చేసిన మిత్రులు సురేందర్ నాయుడు, చంద్రారెడ్డి, జయరాజ్‌ను తోటి మిత్రులు ఘనంగా సన్మానించారు.